# ఓడిపోయిన నిజం

రాఘువులు చేతిలో ఆరోజు పత్రిక వుంది. అందులో ప్రచురింపబడిన మెట్రిక్యులేషన్ ఫలితాలు చూస్తూ, అందులో తన నంబరు పదేపదిసార్లు మననం చేసుకుంటూ మురిసిపోతు న్నాడు.

'ఏమోయ్, స్టేషనుకి రిక్షా కడతావా ?' అంటూ ఒక పెద్దమనిషి అడుగుతూ వున్నా, అది అంతగా పట్టించుకోలేని పరధ్యానంలో వున్నాడు రాఘువులు. అతను మళ్ళీ అడిగాడు.

వాస్తవిక లోకంలో పడ్డాడు రాఘువులు. " నే నిప్పుడు రాలేనండీ; వేరే రిక్షా చూసుకోండి " అనేశాడు పత్రికమీాంచి దృష్టిని మరల్చకుండానే.

ఆ పెద్దమనిషి, రాఘువులు కేసి వింతగా, వుక్రోషంతో చూసి, ఇంకే రిక్షావాణ్ణీ పిలవకుండానే చరచరా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

పక్కనేవున్న కృష్ణకి రాఘువులు ప్రవర్తన ఆశ్చర్యం కలి గించింది. దగ్గరగా వచ్చాడు. " ఏమిట్రా రాఘువులూ, ఆయన రిక్షాకట్టమంటే, కట్టావు కాదేం ? " ప్రశ్నించాడు.

"ఈవేళనుంచి మరి రిక్షా తియ్యన్రా:" యేదో తన్మయత్వంలో వున్నట్టుగా అన్నాడు.

కృష్ణ నిర్ఘాంతపోయాడు. రాఘవులు ఆ నిర్ణయానికి రావడానికి కారణం వూహించుకోలేకపోయాడు.

"కారణం ?"

"నేను మెట్రిక్ ప్యాసయ్యానురా..." వుత్సాహంగా చెప్పుకుపోయాడు రాఘవులు.

"ఏఁవిటి నువ్వంటున్నది ?" వింతగా చూశాడు కృష్ణ. నమ్మలేని విషయమయ్యిం దీతనికి.

"నిజంరా" రెట్టించిన వుత్సాహంతో చెప్పాడు.

కృష్ణ, అమాంతంగా రాఘవుల్ని కౌగలించుకున్నాడు. అక్కడున్న తోటి రిక్షావాళ్ళందర్నీ పిల్చాడు. అంతా అభినందనలు తెలిపారు.

"వెంటనే, యేదో వుద్యోగములో చేరు..." అందరి సలహా అదేను.

రాఘవులు ఆనందంతో వూగిసలాడాడు. అతని కళ్ళల్లో ఒకవిధమయిన కాంతి తొణికిసలాడింది. అక్కడున్న స్నేహితులందరి దగ్గరా సెలవు తీసుకుని, రిక్షాతో ముందుకు పోయాడు. ఆరోజునుంచీ, ఆ రిక్షాకీ, తనకీ ఋణం తీరిందనుకుంటూ మురిసిపోతూ సాగాడు.

*   *   *

రాఘవులు, యిక తన భవిష్యత్తు గురించి ఆలోచించ సాగాడు. ఇంక తను శ్రమజీవితానికి గుడ్ బై కొట్టి, సుఖజీవిత పథంలో అడుగుపెట్టవచ్చు ననుకున్నాడు. తను రిక్షాతీస్తూ, ఆసక్తితో, అతిశ్రద్ధతో, పరీక్షకు కట్టి పాసవ్వడం, విన్నవాళ్ళకి యెవరికయినా హర్షం కలిగించుతుంది. అంతేకాదు – వారిలో సానుభూతి ఏర్పడుతుంది. ఈ విధమయిన సానుభూతే తనకి వుద్యోగం దొరకడంలో దోహదం చెయ్యవచ్చునని ఆశించాడు. ఆ నమ్మిక అతడిలో ప్రగాఢంగా నాటుకుపోయింది.

ఆ నమ్మిక, అతనిలో అంతులేని ఉత్సాహాన్ని రేకెత్తించింది. ఉద్యోగంకోసం దరఖాస్తులు పంపడం ప్రారంభించాడు. స్థానిక ఆఫీసులు దర్శించాడు. లాభం లేకపోయింది. అయితే పంపిన దరఖాస్తులు వూరకనే పోలేదు. ఒక చోటునుంచి ఇంటర్వ్యూకి రమ్మని జాబు వచ్చింది. తన నమ్మిక ఆధారంగా యెన్నో కలలు గన్నాడు. ఆ కలల్ని పదిలపర్చుకుంటూ, యింటర్వ్యూకి వెళ్ళాడు.

ఏవో రెండుమూడు ప్రశ్నలు వేశాక “ఇంతకు ముందు యెక్కడయినా పనిచేశారా ?” అన్నప్రశ్న వేశారాక ఆఫీసరు.

తన నమ్మికకు తగిన అవకాశం చిక్కిందని, సంబర పడ్డాడు రాఘవులు.

“లేదుసార్ ! రిక్షా తీస్తుండేవాణ్ని. అలా శ్రమ పడుతూనే మెట్రిక్ కి చదివి పాసయ్యాను” అన్నాడు సవినయంగా.

అక్కడున్న పెద్దలు తనపట్ల తప్పకుండా సానుభూతి చూపిస్తా రన్న మనోనిబ్బరం అతనిలో బోరవిర్చుకు నిలబడింది.

అక్కడున్న ఆఫీసర్లు మొహాలు చూసుకున్నారు. ఒకా యన పెదవి విరిచాడు. మరొకాయన కనుబొమ్మలు దగ్గర చేశాడు. వారి భావాలేమిటో రాఘవులు అర్థం చేసుకోలేక పోయాడు.

"ఓ...అలాగా? మాకు ఆఫీసు పనిలో అనుభవం వున్నవాళ్ళు కావాలి, ఇక నీవు వెళ్ళొచ్చు." వొక విధమైన ఏహ్యాభావముతో జవాబిచ్చాడు అందులో ఒక ఆఫీసరు. రాఘవులు ఆశించిన సానుభూతి యేకోశానా అగుపించలేదు.

నిరాశ, నిస్పృహా, కృంగదీశాయి రాఘవుల్ని. తన 'నమ్మిక' ఓడిపోయినందుకే అతను మరీ బాధపడ్డాడు. బరు వెక్కిన హృదయముతో అక్కణ్నించి జారుకున్నాడు.

* * *

ఇప్పట్లో అభిమానముతో రిక్షా తియ్యడం మాని వేశాడుగాని, చేతిలో డబ్బులేక తిండికి యిబ్బంది వచ్చేసరికి, తొందర పడ్డానేమో నని ఇప్పుడనుకున్నాడు. అందుకే తప్పని సరిగ రాత్రిపూట రిక్షా తియ్యడం ప్రారంభించాడు. ఏదో ఆరోజు భుక్తికి సరిపడేలా సంపాదించుకునేవాడు.

మళ్ళీ మరో యింటర్వ్యూకి వెళ్లాడు. ఈ సారికూడా అదే ప్రశ్న — అదే జవాబు లభించాయి. రాఘవులు నీరయి పోయాడు. దిగాలు పడిపోయాడు. కళ్ళు నీటిమయమయ్యాయి.

అప్రయత్నముగా, ప్రతిచోటా ఇటువంటి జవాబే వస్తే, యింక తనకి వుద్యోగం దొరికేదెట్లాగో అతడికి అర్థంకాలేదు. అతని కలలన్నీ చెదిరిపోతున్నట్టుగ ఫీలయ్యాడు. ఈ ఆలోచనలతో సతమత మౌతూ, మొహం దించుకుని నడుస్తున్నాడు.

రిక్షా గంటమోగింది. రాఘవులు అంతగా పట్టించుకో లేదు. మళ్ళీ మోగింది. వెనక్కి తిరిగి చూశాడు. రిక్షాలో కృష్ణ కనిపించాడు.

"ఏంవిట్రా రాఘవులూ, పరధ్యానముగా వున్నావు ?" రిక్షా దిగి నడిపిస్తూ అన్నాడు కృష్ణ.

రాఘవులు గట్టిగా ఓ నిట్టూర్పు విడిచి జరిగిందంతా చెప్పాడు. తన అంతరంగంలో అడుగడుగునా జరుగుతున్న సంఘర్షణనూ, భయాన్నీ వ్యక్తం చేశాడు. అతడి స్వరంలో జీర యేర్పడింది.

కృష్ణ అంతా విని చిన్నగా నవ్వేడు. "రాఘవులూ, ఈమాత్రం దానికే నువ్వు ఇంతగా దిగజారిపోతే యెలారా! నువ్వు చాలా అమాయకుడవు సుమా! లోకం పోకడ అర్థం చేసుకోలేకపోయావు" అన్నాడు కృష్ణ.

"అంటే ?" అమాయకంగా స్నేహితుడికేసి చూస్తూ ప్రశ్నించాడు రాఘవులు.

"ప్రపంచం చాలా విచిత్రమైంది, రాఘవులూ; నువ్వు రిక్షావాడివని చెప్పినంతకాలం నీకు వుద్యోగం దొరకదు. ఇప్పుడు

నీగతాన్ని కల్పించి చెప్పాలి. నీ వేషాన్ని డాబుసరిగ మార్చె యాలి. అప్పుడు నీకు ఉద్యోగం దొరక్కపోతే చూడు..." అన్నాడు కృష్ణ.

"అంతేనంటావా ?"

"అంతేమరి, లేకుంటే యీ లోకంలో బ్రతకలేం" అంటూ "కూర్చో రిక్షాలో...పోదాం" అన్నాడు కృష్ణ.

రాఘవులు రిక్షాలో కూర్చున్నాడు. కృష్ణ యీల వేసుకుంటూ రిక్షా తొక్కుతున్నాడు. రిక్షా చక్రములానే రాఘవులు ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి మెదడులో.

*　　*　　*

రాఘవులుకి మరో యింటర్వ్యూకి వెళ్ళే అవకాశం వచ్చింది. ఈసారి కాస్త నీటుగా తయారయి వెళ్ళాడు. మామూలుగా అడగవల్సినవన్నీ అడిగాక,

"ఇంతకు ముందు యేం జేసేవారు ?" అని ప్రశ్నించాడాయన.

"ట్యూషన్లు చెప్తుండే వాణ్ణండీ; నిజానికి నాకు పైచదువులు చదవాలన్న వాంఛ వుండేది కాని విధి నా వాంఛను వంచించింది. నేను మెట్రిక్ చదువుతున్నప్పుడే మా నాన్నగారు గతించారు. దాంతో కుటుంబపు బాధ్యతంతా నా నెత్తిన పడింది—ఉద్యోగాన్వేషణ చెయ్యక తప్పలేదు..." కాస్తబాధగా చెప్పుకుపోయాడు రాఘవులు.

అతని గాథ వాళ్ళ హృదయాల్ని ద్రవింపజేసింది.

"సరే; వెళ్లు... రెండురోజుల్లో ఫలితం తెలియజేస్తాం" అన్నాడొక వ్యక్తి.

రాఘవులు హృదయం తృప్తితో గంతులు వేసిందనే చెప్పాలి. తన కల్పితగాథ వారిలో సానుభూతి కలిగించిందన్న నిర్ణయానికి రాకుండా ఉండలేక పోయాడు. అక్కడున్న వారికి ధన్యవాదాలు చెప్పి వుత్సాహంగా బైటికి వచ్చాడు. ఏదో ఆశ మిణుకు మిణుకు మంటూ అతడికి ఎక్కడో కనిపిస్తున్నట్టయ్యింది.

నాలుగురోజులు గడిచాయి. హఠాత్తుగా వచ్చిపడిన అపాయింట్‌మెంట్ ఆర్డర్, రాఘవుల్ని వుక్కిరిబిక్కిరి చేసినది. జీవితంలో అంత ఆనందాన్ని అతడెప్పుడూ అనుభవించలేదు. నిజానికి తను కృష్ణకి యెంతో ఋణపడివున్నా ననుకున్నాడు. కృష్ణ చూపిన మార్గం అవలంబించక పోతే, తనకి వుద్యోగం దొరికేదే కాదేమో! వాడన్నట్టు లోకంపోకడ వింతగా వుంటుంది మరి; నిజం ఓడిపోయింది... అబద్ధానికి అనుకోని విలువ వచ్చింది. ఏంలోకం?... వెంటనే వెళ్ళి కృష్ణకి తన కృతజ్ఞత చెప్పుకోవాలి... అనుకుంటూ బయలుదేరాడు రాఘవులు... వుత్సాహంతో సాగి పోతున్నాడు... తను ప్రారంభించనున్న కొత్తజీవితం గురించి యేవేవో ఆలోచనలు అతడి మెదడులో తిరుగుతున్నాయి.